## క్లుప్తంగా

### హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలపాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలను పాత కరీంనగర్ జిల్లాలో తిరిగి కలపాలని గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ భీమా సాహెబ్ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలను 2016లో అప్పటి ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలో కలిపిందన్నారు. మెజార్టీ గ్రామ పంచాయతీలు కరీంనగర్ జిల్లాలోనే ఉంటామని తీర్మానం చేసినప్పటికీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందని వాపోయారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నేతలు శివ రాజ్ నాయక్, మాజీ ఎంపీటీసీ భాస్కర్ నాయక్, తిరుపతి, లక్‌పతి నాయక్, రవీందర్ నాయక్, రాజు నాయక్, రమేష్ నాయక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ‘వర్క్‌సైట్’ పాఠశాలలు ఏర్పాటు చేయాలి

గజ్వేల్‌రూరల్: వలస కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో వారి పిల్లల చదువు కోసం వర్క్‌సైట్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో వలస కార్మికుల కుటుంబ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్‌తో పాటు సిద్దిపేట జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల నిర్మాణాలతో పాటు వివిధ రకాల పనుల కోసం వలస కార్మికులు వచ్చినట్లు తెలిపారు. అధికారుల లెక్కల ప్రకారం 17 వర్క్‌సైట్లలో సుమారు 480 మంది పిల్లలను గుర్తించారని, వీరికి చదువు అందని ద్రాక్షగా మారిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పిల్లలను గుర్తించి వర్క్‌సైట్ పాఠశాలలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

రాయపోలు(దుబ్బాక): రెండు నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో పట్టుకున్న పోలీసులు శనివారం బాధితుడికి అప్పగించారు. రాయపోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగారెడ్డిపల్లికి చెందిన మంద కనకయ్య రెండు నెలల క్రితం తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈవిషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నూతన టెక్నాలజీ సాయంతో పోలీసులు సెల్‌ఫోన్‌ను పట్టుకుని అప్పగించారు.

### దరఖాస్తుల ఎంట్రీ పరిశీలన



ప్రజాపాలన డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీఓ బెన్ షాలోమ్

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రజాపాలన దరఖాస్తులను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. శనివారం హుస్నాబాద్ ఆర్డీఓ బెన్ షాలోమ్ దరఖాస్తుల ఎంట్రీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. అయితే డేటా ఎంట్రీ సమయంలో సర్వర్ డౌన్‌తో అప్‌లోడ్‌కు సమయం పడుతుందన్నారు. సర్వర్ డౌన్ కాకుండా చూడాలని ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ శంకరయ్య ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు.

### వైభవంగా హనుమాన్ జెండా పూజ



కాషాయ జెండాలతో భక్తులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హనుమాన్ జెండా పూజా మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ బుక్క రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, ఆలయ పూజారి శేషం శ్రీనివాసాచార్యులు మాట్లాడారు. అయోధ్య రామమందిరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంటింటికీ కాషాయ జెండాను అందజేస్తామని తెలిపారు. అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

# అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

అయోధ్య రాముడి పూజిత అక్షింతలను జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. గజ్వేల్ పట్టణంలోని మురళీకృష్ణాలయంలోని రామాలయంలో శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణ మహాయజ్ఞానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదివారం 108 మంది భక్తులచే రామాలయంలో పారాయణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు రామకోటి భక్తసమాజం అధ్యక్షుడు రామకోటి రామరాజు తెలిపారు.



దుబ్బాకలో అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు



చేర్యాల: కడవేర్గులో ..



గజ్వేల్‌లో మంగళహారతులతో మహిళలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

# నూతన విద్యా విధానం రద్దు చేయాలి

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించే చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు విద్యాసంస్థలు కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వేల్పుల ప్రసన్న కుమార్, సయ్యద్ సర్దార్, సాయికృష్ణ, రాహుల్, వినయ్‌వర్ధన్, తదితరులు ఉన్నారు.

## డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

కొండపాక(గజ్వేల్): ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లిలో ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో 13 మంది యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ.. నియోజకవర్గంలో 4 వేల మందికి డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉచితంగా పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. లైసెన్స్‌లు త్వరగా వచ్చేందుకు కృషి చేసిన వంటేరు ప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న దేవి రవీందర్

# ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని సూరంపల్లిలో బొడ్రాయి, మహంకాళీ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ తమ తమ ఆచారాలకు అనుగుణంగా దైవ చింతన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరి సంధ్య, సర్పంచ్ నర్సింహులు, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పూజిత, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న కల్యాణం వైభవంగా నిర్వహిస్తాం

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అనంతరం స్వామివారి కల్యాణం జరిగే తోటబావి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు స్వామి వారి సొమ్మును దోచుకున్నారని మండిపడ్డారు. దాసారం గుట్టపై కొంతమంది లబ్ధి కోసం స్వామి వారి ధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధికి సహకరిస్తారని పేర్కొన్నారు. గతంలో సీఎం కేసీఆర్ రూ.10 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పిన మాటలు నీటి మూటగానే మిగిలిపోయాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం, నూతనంగా ఎన్నికైన ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు, నాయకులు మహదేవుని శ్రీనివాస్, జంగని రవి, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

# అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

దుబ్బాకటౌన్: దుబ్బాక పీఏసీఎస్‌లో అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక సహకార సంఘంలో గతేడాది సుమారు రూ. కోటి రూపాయల అవినీతి జరిగిందన్నారు. అధికారులు దర్యాప్తు చేసి నిర్ధారించినప్పటికీ ఇంత వరకు డబ్బులను రికవరీ చేయలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలోనే పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడే అవినీతికి పాల్పడ్డారని ప్రధాన పత్రికల్లో వార్తలు వచ్చిన ఆయన ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పుట్ట వంశీ, సుంకోజి ప్రవీణ్, రమేశ్‌రెడ్డి, రమణారెడ్డి, మనోజ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మచ్చ శ్రీనివాస్

## నేడు కూడవెళ్లిలో టెండర్లు

దుబ్బాకరూరల్: రాబోయే మాఘ అమవాస్య జాతర సందర్భంగా అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని కూడవెళ్లి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో వస్తువులు విక్రయించడానికి ఆదివారం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు. కొబ్బరికాయలు, నూనె గురుగులు, పుట్నాలు, ప్రసాదాలు, కల్యాణ మండపం కిరాయి, పూల అలంకరణ, తదితర వస్తువులు విక్రయించడానికి టెండర్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అసక్తి గల వారు టెండర్లలో పాల్గొనాలని కోరారు.

# క్రీడారంగంలో సిద్దిపేట ముందంజ



సెలెక్షన్స్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: సిద్దిపేట అన్ని క్రీడల్లో ముందంజలో ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో గుజరాత్, కొత్తగూడెంలో జరగనున్న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ, రాష్ట్రస్థాయిలో జరిగే అథ్లెటిక్స్‌లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు తోడ్పాటుతో క్రీడారంగంలో సిద్దిపేట అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి, ప్రతినిధులు రామేశ్వర్, శ్రీనివాస్, అశోక్, ఉప్పలయ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ‘ప్రజాపాలన’



హుస్నాబాద్: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్/హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివారం ముగిసింది. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిద్దిపేట పట్టణంలోని 34వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మార్క సతీష్‌గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బైరి సాయికుమార్, పట్నం నరేష్, ముదిగొండ సురేష్, వెన్నెల సుధీర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంతో మంది అర్హులైన వారు కోటి ఆశలతో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించి ఆదుకోవాలని కోరారు. పట్టణంలో మొత్తం 6,918 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



సిద్దిపేటలో పట్టణంలో..





సిద్దిపేట పట్టణంలోని 43వ వార్డులో..

# ఫిబ్రవరిలో ఓటరు తుదిజాబితా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమేష్‌బాబు

సిద్దిపేటజోన్: ఫిబ్రవరి 8వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల కానుందని సిద్దిపేట ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి రమేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణపై సమావేశం నిర్వహించారు. ఈనెల 22వ తేదీ వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 2న వాటి పరిష్కారం, 8న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. తప్పులు లేని, ఆరోగ్యకరమైన ఓటరు జాబితా కూర్పులో అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో మోహన్ లాల్(బీఆర్‌ఎస్), శ్రీనివాస్ రెడ్డి(బీజేపీ), ఇమామ్(కాంగ్రెస్), బన్సీలాల్ (సీపీఐ) పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ**



దుబ్బాక: టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీపీటీఎఫ్ విద్యారంగా సమస్యలతో పాటు సామాజిక సమస్య సాధనలో ఎల్లప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, జయకర్‌రెడ్డి, నాగేశ్వరావు, విశ్వనాథం, పవన్ చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

◆ **గీత కార్మికుడికి గాయాలు**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్‌కు చెందిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వగల బోయిన నర్సింహులు రోజూ మాదిగానే కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడిని గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండకింది అరుణ్ పరామర్శించారు.

◆ **‘కురుమలకు అన్యాయం’**

మద్దూరు(హుస్నాబాద్): కురుమల ఇలవేల్పు అయిన కొమురవెల్లి ఆలయ పునరుద్ధరణ కమిటీలో కురుమలకు చోటు కల్పించకపోవడం అన్యాయమని దూల్మిట్ట కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో కొమురవెల్లి పాలకమండలిలో కురుమలను నియమించేవారని గుర్తు చేశారు. మల్లన్న కల్యాణాన్ని ఒగ్గు జానపద సంప్రదాయ పద్దతిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

◆ **పరామర్శ**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మాజీ ఎంపీపీ ఎల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ ఆయన స్వగ్రామం బేగంపేటలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, నాయకులు శీలం నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణ, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సాయం**

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం పరామర్శించి ఓదార్చారు. ఇరు కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐతం శ్రీనివాస్, రామచంద్రం, రాములు, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

◆ **కార్యకర్తలకు అండగా ఉంటాం**

దుబ్బాకటౌన్: బీజేపీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. పట్టణంలో ఇటీవల బీజేపీ కార్యకర్త నాగరాజు తల్లి మరణించడంతో శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, మచ్చ శ్రీనివాస్, వంశీ, ప్రవీణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పాఠశాల సందర్శన**

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సందర్శించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరుతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



◆ **సస్యరక్షణ చర్యలు తప్పనిసరి**

చిన్నకోడూరు(సిద్దిపేట): పెరిగిన చలి తీవ్రతతో వరి నాళ్లు తెగుళ్ల బారిన పడుతున్నాయి. డిసెంబర్ నెలలోనే వరి నాట్లు పూర్తి చేయాల్సి ఉండగా నారు ఇంకా చేతిక రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చలి తీవ్రత వల్ల నారు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయని మండల వ్యవసాయ అధికారి జయంత్ అన్నారు. జింక్ లోపం కారణంగా నారుమళ్లు దెబ్బతింటున్నాయని, రైతులు నీటిని ఎక్కువగా పెట్టవద్దని సూచించారు. రోజు విడిచి రోజు నీటిని పెడుతూ తర్వాత నారుమళ్ల నుంచి తొలగించాలన్నారు. ఉదయం 6 గంటలకు బోరు నుంచి వచ్చే వేడి నీటిని పెట్టి తర్వాత తొలగించాలన్నారు. నారుమడిపై ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలతో ఊచలు అమర్చి దానిపై ప్లాస్టిక్ కవర్లు కప్పాలని చెప్పారు. ఇనుప దాతు నివారణకు రెండు గ్రాముల జింక్‌ను లీటర్ నీటిలో కలిపి చల్లుకోవాలని పేర్కొన్నారు. జింక్ నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

◆ **రాజకీయ కక్షతోనే కేసు**

గజ్వేల్: రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తమపై కేసులు నమోదు చేశారని గజ్వేల్ పట్టణానికి చెందిన గుంటుకు రాజు, గంగుమల్ల శ్రీనివాస్ రెడ్డి శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో తాము ఒక సర్వే నంబరులో భూమిని కొనుగోలు చేస్తే.. మరో సర్వే నంబరులో కొనుగోలు చేశామని అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.